జీడిమెట్ల నుంచి లిబర్టీ సెంటరుకు బయలుదేరిన స్కూటరు గంట తరువాత సిగ్నల్ పాయింటు దగ్గర ఆగింది. దాదాపు గంట తరువాత ఆ మాత్రం విరామం దొరికినందుకు మనసులోనే తృప్తి పడ్డాడు చలపతి. కాని అరుంధతి మాత్రం తిట్టుకుంటూనే ఉంది. ఓవేపు భర్త గురించి-అతనికి స్కూటరు నడపడం అంతగా రాదు. దానికితోడు ఈ ట్రాఫిక్ ఒకటి. మొత్తం మీద లిబర్టీ దాకా ఎలాగో బిక్కు బిక్కు మంటూ రాగలిగాడు. రెండో కారణం వారం క్రితం స్నేహితురాలితో వెళ్లి కొనుక్కున్న చీరకు అప్పుడు మ్యాచింగు జాకెట్టు దొరకక పోవడం, ఆమెభర్త ఎలాగో మరో షాపులో కొనటం, వెంటనే సదరు ఇల్లాలు కొత్తచీర కట్టేసుకుని స్నేహితురాళ్ల అభిమానం, మెప్పులు, అభినందనలు కొట్టేయడం, ఆ సర్టిఫికెట్లు ముందుగా తనకు రాకపోవడం అవమానంగా తోచింది అరుంధతికి. అందుకే ఇంటి నుంచి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రత్యేక బ్లవుజ్ మ్యాచింగు సెంటరుకు బయలుదేరింది తను.



గ్రీన్‌లైట్ పడగానే కదిలింది స్కూటర్. మరో మూడు ఫర్లాంగులు వెడితే బ్లవుజ్ షాప్ వచ్చేస్తుంది. బతుకు జీవుడా అనుకుంటున్నాడు చలపతి. అంతలో ఎదురుగా కనిపించిన స్నేహితురాలు ఆగమన్నట్లుగా చేయి చూపింది. భర్తని స్కూటరు ఆపమంది అరుంధతి. ఓ నిముషం ఆ మాటా ఈ మాటా అయ్యాక చెప్పింది ఆ స్నేహితురాలు. "మీ ఫ్రెండు రామారావుకి స్కూటర్ ఏక్సిడెంట్ అయింది." అంటూ చెప్పబోయింది. వెంటనే అందుకుంది అరుంధతి. "చచ్చాడా లేదా" అంటూ. ఆ మాటలో కసి, ద్వేషం, అసూయ, కోపం స్పష్టంగా కనిపించాయి. చలపతి మాత్రం స్కూటర్‌వైపు కంగారుగా చూసి అదురుతున్న గుండెను కంట్రోలు చేసే ప్రయత్నం చేశాడు.

"రామారావు స్కూటర్ చాలా జాగ్రత్తగా నడుపుతాడు. ఇప్పటికి అదే స్కూటర్ మీద నాలుగు అక్సిడెంట్లు అయినా బండికి ఏ మాత్రం ప్రాబ్లెం రాకపోయినా, అతనికి మాత్రం ఏవో చిన్న చిన్న దెబ్బలతో సరిపోయింది. అతని భార్య అదృష్టం అనుకో. పైగా అతని మంచితనం, సౌమ్యత, నెమ్మది తనని కాపాడుతున్నాయి" స్నేహితురాలు చెపుతుంటే అరుంధతి కుళ్లిపోతోంది. ఉడికిపోతోంది. ఆమెకు దేవుడి మీద కోపం వచ్చేసింది. ఇంకా రామారావుని బతికిస్తున్నందుకు. అతను ఎలాగైనా చావాలి. స్కూటర్ అక్సిడెంటు కాకపోతే, ఏ గుండెపోటు రాకూడదా అనుకుంటోంది. గతంలో తను రెండొందలు ఖర్చుపెట్టి గారెలు చేసి స్నేహితులకు పంచి పెట్టింది. అందుకు కారణం ఆంజనేయస్వామికి వడమాల వేయించినట్లుగా గొప్పగా చెప్పింది. నిజానికి అరుంధతి స్నేహితురాళ్లకు ఆమె మీద ప్రేమ, అభిమానం నిజంగా ఉండి కాదు. కేవలం నోటికి భయపడి మాత్రమే ఆమెతో ఆప్యాయంగా ఉంటారు. అరుంధతికి సర్కిల్ పెద్దది. ఆ సర్కిల్లో అధికారులు, సినిమా నిర్మాతలు, నాయకుల వంటి వారున్నారు. వారి అండదండ లున్నాయి. నిజం చెప్పాలంటే ఆమెకు మగ స్నేహితులు, అభిమానులెక్కువ. స్త్రీలను దూరంగా ఉంచి అంటీ అంటనట్లుగా ఉంటూనే బోలెడంత అభిమానాన్ని మాటల్తో కురిపిస్తుంది.

"వస్తానోయ్.... మీరెక్కడికో బయల్దేరారు. మీ టైము వేస్టు చేస్తున్నాను" అంటూ

స్నేహితురాలు వెళ్లిపోయింది.

అయిదు నిముషాల తరువాత మాచింగ్ సెంటర్ దగ్గర ఆగింది స్కూటర్.

"త్వరగా వచ్చేయ్" అన్నాడు చలపతి.


"నాకేం చెప్పక్కరలేదు..." అంటూ కసిగా లోపలకు అడుగు పెట్టింది అరుంధతి.

ఇంత భేషజం, పెడసరం ఉన్న మనిషిని ఎక్కడా చూడలేదు. అనవసరంగా ఈమె ఉచ్చులో పడ్డాను. ఈ అయిదేళ్ల కాపురంలో తానొక స్టెప్నీ మొగుడుగా ఉన్నాడు. వంటింటి మొగుడుగా




# చూపుడు వేలు

భమిడి వెంకటేశ్వర్లు




స్పెషల్ క్వాలిఫికేషన్ పొందాడు. ఈ జన్మకింతే... ఎంత ప్రాప్తమో అంతే... దేనికైనా అదృష్టం ఉండాలి. కష్టం ఆశించినందుకు ఫలితం కనిపిస్తూనే ఉంది అనుకున్నాడు చలపతి రోజులాగే.

చీరకు సరిపోయే బ్లౌజు పీసు దాదాపుగా దొరకనే లేదు. సదరు స్నేహితురాలిని అడిగేందుకు చిన్నతనం, నామోషీ అడ్డుపడ్డాయి. రెండు వేల రూపాయల చీరకు బ్లవుజు తనకు దొరక్కపోవడం విచారకరం. ఇప్పుడు స్నేహితురాలు మీద కసి పెరిగింది అరుంధతికి. చీరకొన్నాక పెట్లో పెట్టి ఉంచడం పరువు తక్కువ. ఎదుటి వారి మెప్పు, సర్టిఫికెట్లు తనకు ముందు దక్కకపోవడం దారుణం. తనేమిటి తన సర్కిలేమి... దానికి తగ్గట్టు మరో విషయం గుర్తొచ్చింది. నాలుగు రోజుల్లో సినిమా పాటల పోటీ కార్యక్రమం ఒకటుంది. ఎటూ తనకు ప్రైజు ఇస్తారు నిర్వాహకులు. కాని కార్యక్రమంలో వీడియో చిత్రీకరణ ఉంది. ఎందరో అప్పలమ్మలు పాల్గొంటారు. వారి కన్న తనే గొప్ప. పైగా తనకున్న సర్కిలు వారికేది? తన అందం, అలంకరణ ఈ చీరతో తళుక్కుమనాలి.

"అయిందా?" మరోసారి అడిగాడు చలపతి వాచీ చూసుకుంటూ. అప్పటికి అరగంట దాటిందని అనుకుంటూ.

చివరికి స్వల్ప తేడాతో ఉన్న బ్లవుజు పీసు దొరికింది. ఈసారికి అడ్జస్టు కాక తప్పదు.

స్కూటర్ తిరిగి బయలుదేరింది. చలపతికి ఓ వైపు రామారావు స్కూటర్ ఆక్సిడెంట్... మరోవైపు దూసుకుపోతున్న వాహనాలు చికాకుని, భయాన్ని కలిగిస్తున్నాయి. మనకున్న జాగ్రత్త ఎదుటివారికి ఉండాలి కదా. అందుకే గదా రోజు ఎన్నో ప్రమాదాలు, పోలీసుల విచారణలు.

చలపతి స్కూటర్ ఆపాడు. "తలనొప్పిగా ఉంది. టాబ్లెట్లు వేసుకుని కాఫీ తాగితే సర్దుకుంటుంది అంటూ."

సరేనంది అరుంధతి.

ఆమెకు రామారావు గుర్తొచ్చాడు. అతనితో పరిచయం గుర్తు కొచ్చింది. అతను చాలా అందంగా ఉంటాడు. ఇంచుమించుగా అమితాబ్ బచ్చన్ ఎత్తుంటాడు. వంకీల జుట్టు, ఆకర్షించే గడ్డం, సన్నటి మీసం. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తుంటాడు. చక్కగా టక్ చేస్తాడు. దానికి తోడు స్కూటర్ డ్రైవింగ్ బాగుంటుంది. అతన్ని నెల రోజులు బాగా పరిశీలించింది. పరీక్షించింది. అతని గురించి విచారణ చేసింది. అతని పట్ల మోజు పెంచుకుంది. దానికి తగ్గట్టు అతను కూడా కొద్దిగా కథల పట్ల, పాటల పట్ల, నాటకాల పట్ల ఇంట్రస్టు ఉన్నవాడు. తరచు అటువంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటాడు.

రామారావ్ తన .జీవిత భాగస్వామి కావాలనే నిర్ణయాన్ని ఆల్మోస్ట్ నిర్ణయించేసుకుంది. అయితే అతను తల్లిదండ్రులచాటు అని, వారి నిర్ణయం ప్రకారం గ్రీన్ సిగ్నల్ ఇస్తాడని కూడా తెలుసుకుంది అరుంధతి.

"నా కథలు చదివి నన్ను చాలా మంది అభిమానిస్తారు. నా పాటలు వినాలనుకునేవారూ ఎంతో మంది ఉన్నారు. ఇక నాటకాల్లో నా పాత్రకి జనం హర్షధ్వానాలు పలుకుతారు. మరి మీరెప్పుడూ నన్ను అభినందించలేదు. కారణం తెలుసుకోవచ్చా...'' రెండు మూడుసార్లు అడిగిందామె.

"ఎవరి అభిప్రాయం వారిది" అని మాత్రం అన్నాడు రామారావు నవ్వుతూ.

"అంతేనా, లేక నేను పైకెదిగిపోతున్నానని అసూయ లాంటి దేదన్నా ఉందా... లేక ఎందుకులే అని సరిపెట్టుకుంటున్నారా" నవ్వుతూనే చురక వేసిందామె.

"కొన్ని ప్రశ్నలకు జవాబులు ఉండవు"

"సపోజ్ మిమ్మల్ని కాఫీకి ఆహ్వానిస్తే అంగీకరిస్తారా" మరో అడుగు ముందుకు వెళ్లింది అరుంధతి.

"ఇంటికైతే అభ్యంతరం లేదు. అయినా ఇప్పుడు అంత అవసరం ఏం వచ్చింది. ఎంత మందిని పిలుస్తున్నారేమిటి? రామారావు అడిగాడు.

షాక్ తిన్నదామె. "నాలాంటి అమ్మాయి కేవలం మిమ్మల్నే ఆహ్వానిస్తుంది. నిజానికి హోటలుకి ఆహ్వానిస్తే బాగుంటుంది. అసలు ఇటువంటి ఆహ్వానాలు ఎప్పుడూ ఇంటి వద్ద జరగవు. మీరు కథలు చదువుతారు. సినిమాలు చూస్తారు. ఇంకా అర్థం కాలేదా..."

రామారావుకి నవ్వొచ్చింది. "సినిమా వేరు. కథలు కూడా వేరే. జీవితం వాస్తవం. కథలు చదివి సినిమాలు చూసి అదే జీవితానికి నాంది అనుకుంటే పొరపాటు. మీ రీ విధంగా ఊహించడం కూడ పొరపాటే అని నా అభిప్రాయం. అయినా మీ సర్కిలు పెద్దది. మీ సర్కిల్లో ఎందరో రచయితలు, నటులు, నిర్మాతలు, నాయకులు, పెద్దలు, అధికారులు వంటి వారున్నారు. వారి ముందు నేనెంత..."

అతని మాటలకు అడ్డుపడ్డది అరుంధతి. "ఈ సొదంతా ఎందుకు చెప్పండి. నాతో పరిచయం, స్నేహం కావలనుకునేవారు ఎంతో మంది. వారితో కాఫీ కార్యక్రమం కేవలం అంతవరకే. మిమ్మల్ని ఇంటికి పిలుస్తున్నాను'' అని తన ధోరణి కొనసాగించింది.

"నాకా అర్హత ఉండద్దా... మీ సర్కిల్లో నేను ఎలా ప్రవేశించాలి, అనేదే నా ఆలోచన'' అన్నాడతను.

"అదేం లేదు. వచ్చే ఆదివారం మీరు మా ఇంటికి వస్తున్నారు అంతే" అని నిశ్చయంగా చెప్పింది.

కానీ రామారావు వెళ్లలేదు. మనసులో కోపం ఉన్నా, దాన్ని బయట పెట్టదలచుకోలేదు అరుంధతి. మరో వారం పోయాక బస్టాపులో కలిసిందామె.

"మీతో కొంచెం పని ఉంది. చిన్న ఉపకారం చేసి పెట్టగలరా" అంటూ ప్రారంభించింది.

"చెప్పండి చేయదగ్గది, చేయవలసినది అంత అవసరం ఉన్నది అయితే చేస్తాను."

"ఏం లేదు. నాకు ఈ మధ్య బొత్తిగా ఖాళీ ఉండటం లేదు. ఓ పత్రికవారు కథ పంపమని ఉత్తరం రాశారు. ఇప్పుడు కొత్తగా కథ రాసేంత తీరుబడి లేదు. తిరిగొచ్చిన కథ ఒకటి ఉంది. దాన్ని కొంచెం ఫెయిర్ చేసి పెట్టండి" అంటూ కథ ఇవ్వబోయింది అరుంధతి.

"మళ్లీ ఫెయిర్ చేయడం ఎందుకూ... దీన్నే పంపించేయవచ్చు కదా" అన్నాడతను నవ్వుతూ.

"అదెలా కుదురుతుంది. దాని మీద ఏవో అంకెలు గుర్తులున్నాయి. దానికి తోడు పేజీలు నలిగిపోయి ఉన్నాయి. అందుకే మీ సాయం కోరుతున్నా."

"నా దస్తూరీ నాకే అర్థం కాదు. అందులో మీరు రాసిన ఈ గొప్ప కథ నా దస్తూరీతో పత్రికవారికి అర్థం కాక బుట్టు దాఖలు చేస్తే నన్ను తిట్టుకుంటారు. అందుకని ఓ పని చేయండి" అన్నాడు రామారావు.

"ఏమిటి?" అడిగింది ఆశ్చర్యంగా.

"ఆ మధ్య 'లాసిని సాహితీ సంస్థ' వారు కథల పోటీ పెట్టారుగా. మీరూ అందులో కార్య వర్గ సభ్యులే కాబట్టి... అక్కడున్న కథల్లో ఒకటి తీసి మీ పేరు మీదుగా పంపించేయండి.... అయినా మీకు ఇదేం కొత్త కాదుగా" అన్నాడతను.

అరుంధతి ఆశ్చర్యపోయింది. ఈ వ్యవహారం రామారావు దాకా తెలిసింది. ఈ డొంకను ఇక్కడితో వదిలేయాలనుకుంది. అటువంటి పనులు చేయకూడదు కదా అని తప్పుకుంది.

ఆ తరువాత పదిహేను రోజుల పాటు రామారావుని చూసేందుకు గిల్టీ ఫీలయింది ఆమె. అతన్ని ఎలాగైనా తన మనిషిని చేసుకోవాలని, అందుకు రకరకాల పథకాలు సిద్ధం చేసుకుని అవసరాన్ని బట్టి ప్రయోగించాలనుకుంది తను.

పటానుచెరువు నుంచి ఓ రోజు వస్తున్నాడు రామారావు. ఇక్రిసాట్ కంపెనీ దగ్గర కనిపించింది అరుంధతి. అతన్ని చూసి స్కూటర్ ఆపమన్నట్లుగా చేయి చూపగానే ఆపాడతను. "ఏమిటి ఇక్క డున్నారు? ఇక్కడేమైనా ప్రోగ్రాం ఉందా" అని అడిగాడు.

"అవును... ఇక్కడ ఓ పాటల పోటీ ఏర్పాటు చేశారు. అయితే హఠాత్తుగా రద్దు అయింది అది."

"ఎందుకు?"

"నిర్వాహకుల్లో ఏర్పాట్ల విషయంలో తగవులు, గొడవలు వచ్చి..." అంది అరుంధతి విచారంగా.

'మరి ఇంటికి పంపే ఏర్పాట్లు చేయరా వాళ్లు...'

"చేయరు... డబ్బు ఇస్తున్నారు కాబట్టి ఎవరి ప్రయత్నం వారిది. బస్సుకోసం నిలబడితే నిరీక్షణే మిగిలింది. ఇంతలో దేవుడిలా కనిపించారు మీరు. లకడీకాపూల్ దాకా లిఫ్ట్ ఇవ్వండి ప్లీజ్...' ' అని అర్థించిందామె.

ఆలోచనలో పడ్డాడతను. "మీకు బోలెడంత సర్కిల్ ఉంది కదా... ఎవరికి ఫోన్ చేసినా వాహనం ఇక్కడికే ఏర్పాటు చేస్తారు కదా... ఎదురుగానే పబ్లిక్ టెలిఫోన్ బూత్ ఉంది" అంటూ ఆ వైపు చూపించాడు రామారావు.

"ఏదో సామెత చెప్పినట్లుగా... మీరు కనిపించారు అదే పది వేలు... పదండి... కిక్ కొట్టండి" అంటూ ఎక్కి కూర్చుంది అరుంధతి.

రామారావుకి గత్యంతరం లేకపోయింది. అరగంటలో లకడీకాపూల్ చేరింది స్కూటర్. చాలా థాంక్స్... కాఫీ తాగుదాం రండి." ఎదురుగా కనిపించిన హోటల్ వైపు దారి తీసింది తను.

"ఇప్పుడొద్దు లెండి... ఇప్పటికే మీకు ప్రోగ్రాం రద్దు కావటం వల్ల నష్టం వచ్చింది. మరోసారి చూడచ్చు" అని తప్పించుకోబోయాడు రామారావు.

"నష్టం... కష్టం... ఇబ్బంది చెప్పి రావు. ఇవి రొటీనుగా జరిగేవే. పదండి."

ఇద్దరూ కాఫీ తాగొచ్చారు.

అప్పట్నుంచీ రామారావుకి అరుంధతి ఉద్దేశ్యం బోధపడింది. తరచు బస్టాపులో తన కోసం ఎదురు చూడడం, తను కాదని తప్పించుకోవడం జరిగేది. "నా ఉద్దేశం మీరు గ్రహించే ఉంటారు. మీ అభిప్రాయం చెప్పండి... మనం జీవితాన్ని పంచుకుంటే బాగుంటుంది" అంటూ నాటకీయంగా చెప్పింది అరుంధతి.


షాక్ తినలేదు అతను. మీరు క్షణం తీరిక లేనివారు. మీకు ఇప్పటికే బోలెడంత పవరు, డబ్బు, పరపతి ఉంది. మీ అందం, ఆకర్షణల ముందు నేనెంత... మీరు నన్ను కోరుకోవడం ఏమిటి? మీ సర్కిల్ గురించి ఆలోచించే అర్హత నాకుందా? అందులో నేను ప్రవేశించగలనా? మీ అభ్యుదయ భావాలు మీవి. నేనేదో సంసార పక్షంగా బతికే వాడిని. నాకు ఎక్కువగా చదువుకున్న యువతిని గానీ, హైక్లాసు సర్కిల్ వాళ్లుగానీ నేను కోరలేను. ఇంటిని, పిల్లల్ని కనిపెట్టుకునేవారు చాలు నాకు. మీ అభిప్రాయాలు నేను కాదనను. మీ ఇష్టం... మీకు ఉద్యోగం గడ్డిపోచ కావచ్చు. నేను ప్రభుత్వాన్ని, ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాన్ని, ఉద్యోగం ద్వారా పొందే జీతాన్ని గౌరవించే సంసారపక్షం వాడిని. మిమ్మల్ని నిరుత్సాహపరిస్తే ఆ తప్పు, బాధ్యత నాది కాదు..." నిశ్చయంగా అన్నాడు రామారావు.


అరుంధతి అహం దెబ్బతింది. భేషజం ఉరకలు వేసింది. పౌరుషం విజృంభించింది. అంతే... "మీకు ఆడది పైకి రావడం ఇష్టం లేదు. మీరూ పురుషాధిక్యతనే గౌరవిస్తారు. తెలివిగా సంసారపక్షం అనే మాటని ప్రయోగించారు. ఏదో సామెత చెప్పినట్లుగా ఉంచి మీ జవాబు... నాతో గొడవ పెట్టుకుంటే ఫలితం అనుభవిస్తారు" అంటూ ఛాలెంజ్ చేసింది.

"ఇందులో గొడవ ఏముంది. మీరలా మాట్లాడటం బాగోలేదు. నా అభిప్రాయం చెప్పకూడదా? మీ అభిప్రాయాలు, వ్యక్తిత్వం కథలో కనిపిస్తూనే ఉంది. ఇప్పటికి నా అభిప్రాయం, ఓటు సంసారపక్షానికే. ఇంకెవరి దగ్గరా ఇలా మాట్లాడకండి. అందరూ నాలాగే సౌమ్యులు ఉండరు" అన్నాడు రామారావు నిశ్చయంగా.

అప్పట్నుంచీ అతన్ని పురుగుగా చూడసాగింది అరుంధతి. తన గ్రూపుజనం దగ్గర విమర్శలు, వాఖ్యలు చేయసాగింది. ఇంకా చెప్పాలంటే నాలుగొందలు ఖర్చుపెట్టి, దారి కాసి కొట్టించింది. దూరాన్నుంచే ఇదంతా గమనించి, పైగా సానుభూతి ఒకటి... 'జాగ్రత్తగా ఉండండి. ఎందుకైనా మంచిది' అంటూ.

సరిగ్గా పదిహేను రోజులకు అరుంధతి చలపతిని పెళ్లాడింది. అప్పటికి అతను ఎన్నో సంబంధాలు చూసి విసిగిపోయాడు. ఆ విషయం తెలిసి తన ప్రస్తావన చేసింది. చలపతి ఎగిరి






గంతేశాడు. తనకు కావలసింది దొరికింది. రాజీ పడి బతకటంలో ఆనందం ఉంది అనేది అతని ఫార్ములా. రోజులు గడుస్తుంటే వాస్తవాలు వెలుగు చూపాయి. "హాయిగా ఉద్యోగం చేస్తే చాలదా... ఇలా కథలు రాసి, పాటలు పాడుతూ, నాటకాల్లో వేషాలు వేస్తూ ఎందుకు సంపాదించడం... ఇన్నాళ్ల జీవితం ఇక ముందు కొనసాగడం ఎందుకు? సంసారపక్షంగా ఉండకూడదా" అని సలహా ఇచ్చాడు చలపతి నాలుగైదుసార్లు.

"ఏం చేయాలో నాకు తెలుసు. అంతగా ఇష్టం లేకపోతే మరోదారి చూసుకోవచ్చు" అనేసిందామె.

"అంత మాటెందుకు... నీ ఇష్టం" అనేశాడు చలపతి. అప్పట్నుంచీ అరుంధతి తన బయటి కార్యక్రమాలను పెంచుకుంటూ, ఎక్కువ కాలాన్ని వాటికే కేటాయించసాగింది. చలపతి మాత్రం 'ఎస్. మేడం' స్థాయికి ఎదిగాడు.

హోటల్నుంచి చలపతి, అరుంధతి బయటకు వస్తుంటే, మరో స్నేహితురాలు కనిపించి పలకరించింది. 'మీ ఫ్రెండు నుద్దేశిస్తూ రాసిన కథ సంసారపక్షం పత్రికలో చదివాను. అయినా నీ కిదేం పాడుబుద్ధి. నీకు ఇష్టం లేని వారి గురించి కథలు రాయడమేనా? ఆడదానివై ఉండి ఇలా పచ్చి కథలు రాయడం ఏమిటి. ఇది మంచి పద్ధతి కాదు. కథల్లో రానురాను రీడబిలిటీ ఉండటంలేదు. ఎందుకు రాస్తున్నావో అర్థం కావటంలేదు. రానురాను సెక్సు గుప్పిస్తూన్నావు. అదుంటే తప్ప కథలు అచ్చుకావనుకుంటు న్నావా?' అంటూ మందలించింది.

"నువ్వు రామారావు ఏజంటువా... నిన్ను పంపించాడా... నా ఇష్టం.. నీ గురించి రాస్తాను. అనవసరంగానోరు పారేసుకోకు. ఎవరితో మాట్లాడుతున్నావో గుర్తుపెట్టుకో" అంటూ మందలించింది అరుంధతి.

సదరు స్నేహితురాలు ఇది గ్రహించింది ముందే. అరుంధతికి ఓ గ్రూపు ఉంది. వారి చేత తన కడ్డు తగిలిన వారిని ఎలా తొలగించుకోవాలో బాగానే తెలుసు. అందుకే కొందరు నిజ జీవితంలో ఆమెకు మరింత దగ్గరవుతారు - నటిస్తూ. అదంతా తనకు తెలియకపోలేదు.

చలపతికి భార్య ధోరణి రానురాను అర్థమవు తూనే ఉంది. కాని ఏం చేస్తాడు!

స్కూటర్ బయలుదేరింది. చలపతి ఏదో ఆలోచిస్తున్నాడు. అరుంధతి రామారావు గురించి, బ్లవుజు గుడ్డ గురించి, స్నేహితుల ధోరణి గురించి ఆలోచిస్తుంది.

చాలా ఘోరం జరిగిపోయింది. ఎదురుగా వస్తున్న లారీని చూసి కంగారుపడ్డాడు. చలపతి ఫలితంగా స్కూటరు పక్కగా పోయి పుట్‌పాత్‌ని ఢీ కొట్టింది. చలపతి దూరంగా పడిపోయాడు. అరుంధతి రోడ్డు మధ్యలో వుండిపోయింది. వారికేం జరిగిందో తెలియదు. కారణం వారు స్పృహలో లేరు. అంతలో ట్రాఫిక్ పోలీసులు రంగప్రవేశం చేసి వాహనాలను పక్కగా పోనిచ్చారు. అది బిజీరోడ్డు కాబట్టి వెంటనే ఆ ఇద్దరినీ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఇద్దరికీ చికిత్స జరిపించేందుకు ప్రత్యేక వార్డులో చేర్చారు. చలపతికి బలంగా గాయాలు తగిలాయి. అరుంధతికి ముఖం మీద, చేతుల మీద చర్మం చీరుకు పోయింది. స్కూటరు కూడా బాగానే దెబ్బతింది. దాన్ని పోలీసు స్టేషనుకు తరలించారు.

నాలుగు రోజులయినా చలపతికి తెలివి రాలేదు. అరుంధతికి పదిశాతం బెటరుగా ఉంది. మరో విశేషం ఏమిటంటే ఈ ప్రమాదం వార్త తెలిసి ఆమె అభిమానులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించక పోవడం.... కథల్లో మానవత్వం చూపించే తీరుగాని, నాటకాల్లో సమాజ నీతిని బోధించేవారుగాని, పాటల్లో కోయిలకంఠం వినిపించే వారుగాని కరువయ్యారు. ఆసుపత్రి కెడితే తమకు ఏదో రోగం చుట్టుకుంటుందని ... బోలెడు టైము వృధాతో పాటు డబ్బు ఖర్చు... వారంతా మంచితనానికి, మానవత్వానికి సిసలైన ప్రతినిధులు. ముఖ్యంగా అరుంధతి అను చరులు... ఓ గొడవ చేయాలంటే వెంటపడేవారు నోటికొచ్చినట్లు తిట్లతో తెలుగుభాషను ఉచ్ఛరిస్తూ ఆమె అందించే డబ్బుని తిట్లతో పెట్టుకుని చిత్తుగా పెద్దలు .... ఘరానా మనుషులు....

ఇదంతా రామారావు గమనిస్తూనే ఉన్నాడు. ఎప్పటికప్పుడు వెళ్లి చూడాలనే ఉంది... అరుంధతి తనని శుభ్రంగానే చూస్తోంది. కాని తనకు ఎవరు శత్రువులు లేరు. తన గురించి బూతుకథ రాసినా రియాక్టు కాలేదు. తనని స్నేహితులు రెచ్చగొట్టారు. కాని తను నిగ్రహం పాటించాడు. ఎవరి విలువ వారికి ఎప్పుడూ ఉంటుంది. అది ఒకరిస్తూ వచ్చే కిరాయికాదు. భగవంతుడు మనసిచ్చాడు. తెలివిచ్చాడు. అయితే ఒకరు రహదారి మీద నడుస్తారు. మరొకరు సందులో, ఇరుకు రోడ్ల గుండా నడుస్తారు. ఆలోచనలు ఆగిపోయాయి తనకి.

అరుంధతి కళ్లు తెరిచేసరికి ఎదురుగా కనిపించాడు రామారావు. ఆమె వంటికి, ముఖం మీద బేండేజీలు వేశారు. ఆమె కళ్లు చెమర్చాయి. అతను ఉన్నతంగా కనిపించాడు. ఆమె సిగ్గుతో కళ్లు మూసుకుంది... జేబులో నుంచి కుంకుమ పొట్లాం తీశాడు. చిటికెడు తీసి ఆమె నుదుటిన దిద్దాడు. మరో పొట్లాం తీశాడు. అందులో నుంచి ఓ గారె తీశాడు. "ఇది ఆంజనేయస్వామికి నిజంగా వేసిన వడమాల ప్రసాదం. ఈ రెండు మిమ్మల్ని త్వరగా కోలుకునేలా చేస్తాయి. మీ వారు త్వరగా కోలుకోవాలని నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు కొందరికి జరగాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు ఎలాగో జరుగుతాయి. అయితే కొన్ని ప్రమాదాలు కొందరికే జరగాలని దేవుడ్ని ప్రార్థిస్తారు కొందరు. అదీ మనం కోరకూడనిది... అని నా ఉద్దేశం." అన్నాడు రామారావు సానుభూతిగా.

అతను అక్కడ్నుంచి బయటకు నడిచాడు. తాను మూడుకాళ్ల కుందేలుగా మూర్ఖంగా ప్రవర్తించినందుకు మనసుతో ఆలోచించకుండా మరో విధంగా అతన్ని ఎక్కువగా అర్థం చేసు కొన్నందుకు నిజమైన అభ్యుదయవాది ఎవరో గుర్తించింది అరుంధతి. "రామారావ్ ది గ్రేట్" అని స్వగతంలో అనుకుంది తను. ●